క్లుప్తంగా

రూరల్ డీసీపీగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ రూరల్ డీసీపీగా కె.శ్రీనివాసరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం డీసీపీగా పని చేస్తున్న శ్రీనివాసరావును రాష్ట్ర హోం శాఖ జిల్లాకు కేటాయించింది. జిల్లా కమిషనరేట్‌లో బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను కలిసి మొక్కను అందజేశారు.

'చెస్'లో ఫిడే రేటింగ్ సాధించిన సూర్యతేజేష్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): గత నెల తెలంగాణాలో జరిగిన బిలో 1600 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీ విద్యార్థి మీసాల సూర్యతేజేష్ ఫిడే రేటింగ్(1164) సాధించాడని అకాడమీ డైరెక్టర్ ఎ.రామకృష్ణ తెలిపారు. మొత్తం తొమ్మిది రౌండ్లలో ఐదు రౌండ్లు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో సూర్యతేజేషను అభినందించారు. ఇలానే మరిన్ని విజయాలను సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ దేవాలయాల కేశఖండన శాల నాయీబ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) ఆవిష్కరించారు. బందరు రోడ్‌లోని ఎంపీ కేశినేని కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రాందాస్, ఉపాధ్యక్షుడు (శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కేశఖండనశాల అధ్యక్షుడు) రాలి వెంకట రమణ, రాష్ట్ర కార్యదర్శి, గౌరవ సలహాదారులు ఏజీఎల్ నారాయణ, సెక్రటరీ జి.హరి కిరణ్, ట్రెజరర్ ఎ.పూర్ణ కనకారావు, సభ్యులు అవిడి రాంబాబు, ఐ.ఆంజనేయులు, కె.కిషోర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రతినిధులు ముస్లింలకు సహాయపడాలి

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) ప్రతినిధులు ముస్లింలకు సహాయపడాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూల్‌మీరా అన్నారు. 64వ డివిజన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం కమిటీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాటివారికి సాయపడుతూ ఉండాలని, అలాంటి వారే కమిటీలో నియమించడానికి అర్హులన్నారు. విజయవాడ నగర ఆజాద్ ముస్లిం కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎండీ రఫీని నియమిస్తూ, నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్‌అలీ పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి దాతలు బీరువా బహూకరించారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొడాలి జగన్ మోహన్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె కోగంటి పద్మావతి శుక్రవారం బీరువాను బహూకరించారు.గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ దాతలు సమకూర్చిన రూ. 7 వేల ఖరీదైన బీరువాను గ్రంథాలయానికి అప్పగించారు. పూర్ణమ్మ మాట్లాడుతూ కొడాలి జగన్‌మోహన్ రావు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు.దాత పద్మావతిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రంథాలయాధికారిణి కే.రమాదేవి, కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ హయాంలోనే నగరం అభివృద్ధి



61వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే విజయవాడ నగరం అభివృద్ధి చెందిందని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 61వ డివిజన్ ప్రశాంతినగర్‌లో ప్రతీ గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రతీ డివిజన్‌ని మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ఎన్నడూలేని విధంగా 61వ డివిజన్ అభివృద్ధి జరిగిందని, రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, సచివాలయాలు, పార్కులు లాంటివి అభివృద్ధి చేసి చూపామని పేర్కొన్నారు. శనివారం దెందులూరులో జరిగే 'సిద్ధం' సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, నాలం బాబు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో వైఎస్సార్ సీపీదే గెలుపు

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీదే గెలుపని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 62వ డివిజన్ పటేల్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఇంటింటికెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హత కల్గిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ఎజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందని పేర్కొన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకం అందలేదని ఎవరైనా చెబితే అధికారులపై చర్యలు తీసుకొంటామని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి మా జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో ఏనాడైనా చంద్రబాబునాయుడు ఇలాంటి పథకాలను ప్రజలకు అందించాలనే ఆలోచన చేసాడా అని ప్రశ్నించారు. వెన్నుపోటు పొడవడం, దోచుకోవడం, దాచుకోవడంలో చంద్రబాబు పేటెంట్ సంపాదించుకున్నాడని హేళన చేశారు. సీఎం జగన్ ఎంత మంచి పరిపాలన ప్రజలకు అందిస్తున్నారో చూసి చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలన్నారు. 62వ డివిజన్‌లో సుమారు 400 గడపలను సందర్శించడం జరిగిందని ప్రజలందరూ ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మీ, పార్టీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, బుజ్జి, హైమావతి, మహేష్, సాంబయ్య, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



62వ డివిజన్‌లో స్థానికుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

ఆహ్లాదంగా కాల్వ గట్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరంలోని కాలువ గట్లను సుందరంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు అత్యంత దయనీయంగా ఉన్న కాలువలు నేడు ఆధునికతను సంతరించుకున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి కాలువలు ఆధునీకీకరిస్తోంది. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బందర్ కాలువ వద్ద కాలువగట్లు పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఆ సమీపంలో ఉన్న కాల్వగట్లపై సేదతీరుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బందర్ కెనాల్ కాలువగట్లపై నాడు చెత్తా చెదారంతో అధ్వానంగా ఉన్న దృశ్యం





నేడు అదే ప్రాంతంలో పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉన్న దృశ్యం

ఆర్‌యూబీ పనులు త్వరగా పూర్తిచేయండి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఆర్‌యూబీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మధురానగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని చెప్పారు. కనెక్టింగ్ బ్రిడ్జి ఆర్సీసీ ఫౌండేషన్ పనులను ఫిబ్రవరి 5 కల్లా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-2 శ్రీనివాస్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన 45వ డివిజన్‌లో పర్యటించి హైవే వద్ద ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయటానికి అవకాశాలు పరిశీలించాలని సూచించారు. స్థానికంగా సితార రోడ్డులో హైవేపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి చెప్పారు. ఫ్లై ఓవర్ దిగువన ఉన్న కల్వర్టు గ్రిల్స్ పాడవ్వగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే మరమ్మతులు చేయాలని తెలిపారు. అనంతరం విద్యాధరపురం స్టేడియంని పరిశీలించారు. త్వరగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఈఈ నారాయణ మూర్తిని ఆదేశించారు. జాతీయ రహదారి ప్రాంతాన్ని పరిశీలించి మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. చూపరులకు కనువిందు చేసేలా ఫౌంటేన్లను ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కేశినేని నాని విశేష కృషి

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్



కేశినేని భవన్‌లో ఎంపీ కేశినేని నానికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరాభివృద్ధికి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కుమార్ అన్నారు. నగరంలోని కేశినేని భవన్‌లో ఎంపీ నానిని ఆకుల శ్రీనివాస్ పలువురు పార్టీ సీనియర్ నాయకులతో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్ఛం అందజేశారు. పక్కా ప్రణాళికతో భవిష్యత్ తరాల సౌకర్యార్థం బెంజ్ సర్కిల్ రెండు ఫ్లై ఓవర్లు, వన్‌టౌన్‌లో కనక దుర్గ ఫ్లై ఓవర్ నిర్మాణంలో ఎంపీ నాని కృషి అభినందనీయమని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పెదకాకాని నుంచి అవుటపల్లి వరకు నాలుగు లైన్‌ల బైపాస్ రోడ్డు నిర్మాణం ఆయన హయాంలోనే మంజూరైనట్లు గుర్తు చేశారు. టాటా ట్రస్టు ద్వారా జిల్లా వ్యాప్తంగా పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడం, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారికి ట్రాక్టర్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేయడం వంటి తదితర సేవా కార్యక్రమాలతో ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు మరింత సేవచేయాలనే దృక్పథంతో కేశినేని నాని వైఎస్సార్ సీపీలోకి రావడం శుభ పరిణామం అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని నానితో పాటు ఏడు అసెంబ్లీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. నాని రెండు లక్షల ఓట్లు మెజారిటీతో గెలుపొందడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొదిలి చంటిబాబు, అల్లం పూర్ణచంద్రరావు, యరజర్ల మురళి, ఆర్టీసీ సుబ్బారెడ్డి, మేకం చిన్నా, బొమ్ము రాము, సూరసాని రామిరెడ్డి, లేళ్ల లాజర్, ఎం.వెంగలరెడ్డి, కే వెంకటేశ్వరరావు, బసవ బోసు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శిరీష

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమత రాజకీయాలకు అతీతంగా ప్రతీ గడపకు సంక్షేమం అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో శుక్రవారం ఆమె వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ అందించడానికి వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, డ్వాక్రా మహిళలను కలిసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మురుగు కాలువలను శుభ్రం చేయడంతోపాటు దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీ జయరాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, విజయ్, గోవిందు, వెంకటేశ్వరరావు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

వీఎంసీ బడ్జెట్‌కు స్థాయీ సంఘం ఆమోదం



స్థాయీ సంఘం బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను వీఎంసీ స్థాయీ సంఘం ఏకగ్రీవంగా ఆమోదించింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ఈ సమావేశంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి వీఎంసీకి సమకూరే ఆదాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ప్రత్యేక నిధులు జమ, వీఎంసీ పలు అభివృద్ధికి చేసే ఖర్చుల నివేదికను అధికారులు స్థాయీ సంఘంలో ప్రవేశపెట్టారు. దీనిని సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, నగరాభివృద్ధి రెండింటిని రెండు కళ్లుగా పరిగణించి 2024–25 సంవత్సరపు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. శాఖధిపతులందరూ తమ శాఖలో 2023–2024 లో కేటాయించిన బడ్జెట్, అయిన ఖర్చులు, వచ్చిన ఆదాయాలు, 2024–2025 బడ్జెట్ అంచనాలను స్టాండింగ్ కమిటీ ముందు ఉంచారని తెలిపారు. కమిటీ సభ్యులు, శాఖాధిపతులతో చర్చించి ప్రజా ప్రయోజనాల గురించి అవసరమయ్యే బడ్జెట్ ప్రతిపాదనలు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించామని పేర్కొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి ఆచార్య ఆత్రేయ



మాట్లాడుతున్న రమాసత్యనారాయణ, పక్కన విజయలక్ష్మి, బలరామకృష్ణమూర్తి తదితరులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి ఆచార్య ఆత్రేయ అని విశ్వమాతా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యాన గాంధీనగర్‌లో హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నాటక, సినీ మాటలు, పాటల రచయిత ఆచార్య ఆత్రేయ స్ఫూర్తి సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ ఆత్రేయ పాటల రచయిత మాత్రమే కాదని అనేక నాటకాలు రచించినట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ 1951లో దీక్ష సినిమాతో ఆయన సినీ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. మూగమనసులు సినిమాలోని పాటలతో ఆయన మనసుకవిగా స్థిరపడ్డారని తెలిపారు. గాయనీ గాయకులు సుధారాణి, విష్ణుప్రియ, హరికృష్ణ, వడ్లాది కామేశ్వరి, ఆదిరాల జయప్రభ ఆత్రేయ రచించిన సినీ గీతాలను ఆలపించారు. రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ సభను నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చొరవతో రహదారులకు మహర్దశ



ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలోని రహదారులన్నింటికీ మహర్దశ వచ్చిందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. సింగ్‌నగర్ పైపులరోడ్డు నుంచి వైఎస్సార్ జంక్షన్ కూడలి వరకు రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న ఇన్నర్ రింగ్ రోడ్డుపై తారురోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీశైలజ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో రోడ్ల నిర్మాణాలను పూర్తిగా విస్మరించారని చెప్పారు. రోడ్లన్నీ గోతులమయంగా మారడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించారని వెల్లడించారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే రూ. 100 కోట్లతో శివారు ప్రాంతాలన్నింటిలో నూతనంగా రోడ్డు నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా రూ. 5 కోట్లతో తారురోడ్డును వేస్తున్నామని వివరించారు.

కాపుల అభివృద్ధికి కృషి చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కాపులంతా ఐక్యంగా ఉంటూ కాపుల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు సూచించారు. 61వ డివిజన్‌లో శుక్రవారం కాపులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ పేద కాపు కుటుంబాల్లోని ఆడపిల్లలకు ప్రభుత్వం పెళ్లి కానుక పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 61వ డివిజన్ ప్రజా కాపునాడు అధ్యక్షుడిగా లింగం శ్రీకాళీని నియమించి నియామకపత్రం అందజేశారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీస్‌స్టేషన్ పరిధి శాంతినగర్‌లో ఉరివేసుకొని చందు(38) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గతంలో ప్రెస్ రిపోర్టర్‌గా పని చేసిన గొన్నూరు చందుకి 2013లో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా భార్యతో విడిగా ఉంటున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఈ నెల 1వ తేదీన ఇంటిపైన ఉన్న రేకులషెడ్డులో నిద్రించడానికి వెళ్లిన చందు కిందకి రాకపోవడంతో అతని తల్లి మొహ్మద్ బీబీజాన్ ఇంటిపైకి వెళ్లి చూడగా రేకులషెడ్డు తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు తెరిసి చూడగా ఉరివేసుకొని మృతి చెందాడు.స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకి దింపి పోలీసులకు సమాచారం అందించారు. బీబీజాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో ఈ నెల 8వ తేదీ గురువారం మాస శివరాత్రి పురస్కరించుకొని లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జూనియర్ డెవలపర్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఇంటర్, డిప్లొమా ఏదైనా డిగ్రీ అపైన అర్హత కల్గిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 3 నెలలు పాటు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ఈ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానం తో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాలలో స్వయంగాకానీ 7799669907 నంబరులో గానీ సంప్రదించాలన్నారు.